అంతర్వాహిని

'హితశ్రీ'

రివ్వురివ్వున వీచే గాలుల్లో జనతా ఎక్స్‌ప్రెస్ ముందుకి దూసుకుపోతూ పట్టాలు మారుతోంది. తనకి చేరువగా ఉన్న కిటికీ అద్దం పైకిలాగి విశ్వం తూర్పు దెసగా చూశాడు.

వయ్యారాలు వొలకబోస్తూ దవ్వుదవ్వులకి జరిగిపోయే చీకటిచీర చెంగు దొంకపుచ్చుకుని వెలుగు సరాగా లాడుతుంటే ఆకాశం ముసిముసిగా నవ్వుతోంది!

చైత్ర శుద్ధ పాడ్యమి.

తెల తెలవారుతోంది.

కొత్తగాలులు రివ్వున వీస్తూ విశ్వాన్ని పరామర్శించాయి. ఆ శుభోదయ సుందర దృశ్యాన్ని వేడుకగా చూస్తూ పులకితుడయాడు విశ్వం. వెనకనించి ప్రసరించే అరుణకాంతికి కొండల అంచులు గీతలు గీసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆకాశమార్గాన పక్షులు స్వేచ్ఛగా కలకల గానంచేస్తూ బారులు బారులుగా సాగిపోతున్నాయి. దూరంలో పసుగణాలు తీరికగా పచ్చిక మేస్తున్నాయి. ఆ పరిసరాలు చూడగానే విశ్వానికి ప్రాణం లేచివచ్చినట్టయింది. ఆ ప్రాంతంలో తనెప్పుడూ సంచరించలేదు, నిజమే. కాని ఆ చిరపరిచిత దృశ్యాలన్నీ ఏదో ఆత్మీయతని జ్ఞాపకం చేస్తూంటాయి ఎప్పుడూ. అక్కడ రైలు దిగి ఆ ప్రదేశమంతా కాలినడకన తిరగాలని తన కెన్నోసార్లు అనిపించింది. కాని ఇప్పటివరకూ అది కోరికగానే నిలిచిపోయింది. మనుషుల కోరికలు కొన్ని ఎంత చిన్నవైనా ఎప్పుడూ కోరికలుగానే నిలిచిపోతూంటాయి. సముద్రస్నానం చెయ్యాలని తనకి ఎన్నోసార్లనిపించింది. వాల్తేరులో మూడు సంవత్సరాలు గడిపినా, చివరికి ఆ కోరిక తీర్చుకోకుండానే ఆ ఊరు విడిచి వచ్చేస్తున్నాడు.

రయిమని వీచిన గాలికి ఇంజన్‌లోనుంచివచ్చిన నుగ్గురవ్వ విశ్వం కంట్లో పడ్డది. తటాలున తల వెనక్కిలాక్కుని జేబురుమాలుతో ఎలాగో అవస్థపడి దానిని తీసివేశాడు. కాని కన్ను ఎర్రబడ్డది. అప్రయత్నంగా ఎదురుగాఉన్న సీటువైపు చూశాడు విశ్వం. ఆ అమ్మాయి ఇంకా అలాగే కూర్చుని నిశ్చలంగా కిటికీలోంచి బయటికి చూస్తూనే ఉంది. తన అవస్థ ఆమె చూసేవుంటుంది. అయినా తల లోపలికి తీసుకోదేం? తన ఉనికి గుర్తించటం ఆమె కేమాత్రం ఇష్టం ఉన్నట్టు లేదు. ఇంతకీ, స్వానుభవమైతేగాని ఏ విషయమూ మనుషులు గుర్తించరు. అందుకు కారణం ఒకప్పుడు నిర్లక్ష్యమూ, ఇంకోసారి అహంకారమూను. పాపం, ఆమె కంట్లో రవ్వపడితే అవస్థపడుతుంది కాబోలు. ఆడవాళ్లు ఎంతసేపటికీ పైకి డాబు సరేగాని ఎంత చిన్న ఉపద్రవం జరిగినా ఇట్టే బయటపడిపోతారు. అయినా, ఈ అమ్మాయికి కొంచెం బెట్టు ఎక్కువలా ఉంది. రాజమండ్రినించీ చూస్తున్నాడు. ఒంటరిగా అర్ధరాత్రి రాజమండ్రిలో ఈవిడ రైలెక్కటం ఆశ్చర్యంగానే ఉంది. ఎవరో స్నేహితురాండ్రు మొదలైనవాళ్లు స్టేషన్‌కివచ్చి సాగనంపి వెళ్లారు. అప్పటినించీ ఆమె ముభావంగా అలాగే కూర్చుని ఉంది. ఉత్తర హిందూస్తానీ యువతిలా తలమీద ఆ ముసుగెందుకూ? తన అందం కళ్ళతో తాగెయ్యటానికి ఇక్కడెవరో సిద్ధంగా వున్నట్టు!

ఈ అమ్మాయి ఎవరోగాని వేషభాషల్లో నాగరికత ఉట్టిపడుతూ నేవున్నా కొత్త పూర్వాచారాల చాదస్తం వున్నట్టుంది. గోదావరినదిలో డబ్బులువేసి దణ్ణం పెట్టింది. తనకి నవ్వొచ్చింది. తను చూస్తున్నాడనే సంకోచమైనా ఆమెకి కలగలేదు. ఆ అభిప్రాయం వుంటే ఓ చిన్న దొంగచూపు చూసివుండేదే! అన్నట్టు ఆమె రెండుమూడుసార్లు తనవైపు చూసినట్టు అనుమానంగా ఉంది. తన తోలుసంచీ వైపుమాత్రం తప్పకుండా చూసింది. బహుశా దానిమీద తన అడ్రసు వుండే వుంటుందనుకుందేమో! అంత తెలుసుకోవాలని

వుంటే తనని అడగకూడదూ? పలకరిస్తే నోటిముత్యాలు రాలిపోతాయికాబోలు. ఎక్కడికి వెళుతుందో ఈమె! ఒకవేళ విజయవాడలో దిగిపోతుందేమో!

ఈ ఆలోచనరాగానే మళ్ళీ కిటికీలోంచి బయటికి చూశాడు విశ్వం. జనతా ఎక్స్‌ప్రెస్ విజయవాడ సమీపిస్తోంది. కెవడా ఇంజన్ గావుకేక పెట్టింది. తను గుంటూరువెళ్ళే బండీలోకి మారాలి. చేతిగడియారం చూసుకుని, లేచినుంచుని సామాన్లు సర్దుకోసాగాడు విశ్వం. తోలుసంచీ తియ్యబోయి అప్రయత్నంగా ఆమెవైపు చూశాడు అతను. ఆమె యథాలాపంగా తన సామాన్లవైపు చూసింది. ఒక్క క్షణం విశ్వంలో ఏదో బలహీనత ఆవరించి తన అడ్రస్ ఆమెకి కనిపించేలా ఆ సంచీ తిప్పాలని అనుకున్నాడు. కాని వెంటనే ఆ ఊహకి సిగ్గుపడ్డాడు. తనెందుకు ఆమెని గురించి అంతసేపు ఆలోచించాడు? తనెవరు, ఆమె ఎవరు? ఆమెని మళ్ళీ తనజీవితంలో ఎప్పుడూ చూడటం తటస్థించకపోవచ్చు. పైగా ఆమె తనకి స్నేహితురాలేమీ కాదు. ఆమెతో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. రాజమండ్రినించి కలిసి ప్రయాణం చేశారు, నిజమే. అయినా ఆమెని గురించి ఏ విషయమూ తనకి తెలియదు. తనని గురించి ఆమెకీ తెలియదు. ఆమె తనని గురించి ఏమైనా అనుకుందో, లేదో! అనుకునే ఉంటుంది. తను ఏవేవో అనుకున్నాడు. ఆమె మాత్రం ఎందుకనుకోకూడదు! చిత్రం, ఇంతసేపు ప్రయాణంచేసే మనసులో అనుకోటాలతోనే విడిపోతున్నారు తనూ, ఆమే. తోటి ప్రయాణీకులతో మాట్లాడకుండా దూరప్రయాణాలు చేసిన రోజులున్నాయి—భాష తెలియనందువల్ల. ఆ వ్యక్తి తెలుగువాడై, మగవాడైతే తను మాట్లాడకుండా వుండడు. కాని 'ఆమె' ఐపోయింది ఆ వ్యక్తి!

ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం సమీపిస్తోంది. ఆమె ఏమిటో సర్దుకుంటున్నట్టుంది. సామాన్లు ఏమీ లేవే. ఒక చిన్న చేతిసంచి మాత్రం ఉంది. వెనక్కి తిరిగి చూడాలనిపించింది విశ్వానికి. కాని సాహసం చాలలేదు. ఒకవేళ అదే సమయంలో ఆమెకూడా తనవైపు చూస్తే!

“టిక్కెట్టు పోయిందండీ.”

ఆందోళన వ్యక్తమయే సన్నని స్వరం వినిపించింది. విశ్వం గుండె కొట్టుకోవటం స్పష్టంగా విన్నాడు. వెనక్కి తిరిగాడు. కాని ఆమెవైపు చూడటానికి బిడియపడ్డాడు.

“ఎలాగండి?”

ఏం చెప్పాలో విశ్వానికి తెలియలేదు.

“ఎలాపోయింది!” ప్రయత్నించి అడిగాడు.

“ఏమో. చేతి రుమాలులో పెట్టుకున్నాను. కిందపడిపోయిందేమో!”

విశ్వం చుట్టుపక్కల చూశాడు. ఏమీ కనిపించలేదు. ఆమె గాభరా పడుతోంది. అతనికి కొంచెం చిరాకు వేసింది. ఆడవాళ్ళు జాగ్రత్త మనుషులని తను ఇప్పటిదాకా అనుకున్నాడు.

“బయటపడిపోయి ఉంటుంది. ఎలాగండీ?” అందామె.

“టి. సి. తో చెప్పండి” అందామనుకున్నాడు. కాని జాలి వేసింది. ఇదీకాక తనేమీ చెయ్యలేకపోతే వొట్టి అప్రయోజకుడనుకొంటుందేమో. ముక్కూ మొగం ఎరగని మనిషే అయినా ఆమె తననిగురించి అలా అనుకోటం తనకిష్టంలేదు.

“పోన్లెండి, పోయినా ఫరవాలేదు. ఇంకో టిక్కెట్టు తెచ్చిపెడతాను. ఎక్కడిదాకా వెళ్ళాలి?” అడిగాడు ధైర్యం చెబుతున్నట్లు.

“విజయవాడలో దిగిపోతానండీ.” ఆలోచించాడు విశ్వం. స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ ఆగింది.

“టికెట్ నెంబరు తెలుసా?”

“ఊఁహుఁ”

ఇంత అజాగ్రత్త మనిషికి పరాకేమిటి? తనెప్పుడూ టికెట్ కాదుగదా, ఇంకేదీకూడా పారేసుకోలేదు. అయినా, టికెట్ కొనగానే నెంబరు చూసి గుర్తు పెట్టుకోటం తనకి అలవాటు.

“ఇప్పుడే వస్తానుండండి.” అనేసి, రైలుదిగి నడవసాగాడు విశ్వం. గార్డు కనిపించాడు. అతనితో చెబుదామనుకున్నాడు విశ్వం. కాని ఏం లాభం? ఎక్సెస్ కట్టుకోవాలిసిందేనంటాడు. ఆమె దగ్గిర డబ్బుందో, లేదో. అబ్బ, సమస్యలు తెచ్చిపెట్టటం ఈ ఆడవాళ్ళ నైజం. విసుగ్గా ప్లాట్‌ఫారం చివరిదాకా ఓ చూపు విసిరాడు విశ్వం. చప్పున అతనిలో ఊహ తట్టింది. గబగబ బుకింగ్ ఆఫీసు దగ్గరికి వెళ్ళి ఓ ప్లాట్‌ఫారం టికెట్ తీసుకుని వెనక్కు వచ్చాడు. కిటికీ

లోంచి ఆమె చూస్తోంది. ఆ లేత ఆకుపచ్చ మేలి ముసుగు తనకి గుర్తే.

"ఇదిగోనండి ప్లాట్ ఫారం టికెట్. స్టేషన్‌వాళ్లు ఎవరైనా అడిగితే రైల్లో ప్రయాణం చెయ్యలేదని చెప్పండి." టికెట్ ఇస్తూ అన్నాడు విశ్వం.

"అబద్ధమా?" అందామె ఇష్టంలేనట్టు. ఆ అనటం కూడా తను ఉత్తి అబద్ధాలకోరు అనే నిర్లక్ష్య భావం సూచిస్తూ అన్నట్టు వినిపించింది అతనికి. అందులో ఏదో అపహాస్యం కూడా ధ్వనించింది. విశ్వానికి ఒళ్ళు మండింది.

"నిజం చెప్పినా ఫర్వాలేదు, దగ్గర డబ్బుంటే" అనేసి పోర్టర్‌ని పిలిచి సామాన్లుపట్టించుకుని గుంటూరు బండికేసి నడవసాగాడు విశ్వం. అతని మనసు పరిపరి విధాల ఆలోచిస్తోంది. అలా కర్కశంగా అనకుండా వుంటే బావుండేదనిపించింది అతనికి. పాపం, చిన్నబుచ్చుకుందేమో. అయినా ఆమె అలా ఎందుకనాలి? ఒక్కొక్కసారి నిజానికి విలువ శూన్యమనే విషయం తెలియనంత అమాయకురాలా ఆమె! అర్ధరాత్రి ఒంటరిగా ప్రయాణంచేసే మనిషికి అమాయకత్వమేమిటి? కాని ఆమె తెంహోమాసే పాతకాలపు వాసనలు పోయినట్టు లేవు. సొంత డబ్బు పెట్టుకుని టికెట్ కొనిస్తే కనీసం 'థాంక్స్' అని కూడా అనలేదు. ఏం మర్యాద! మర్చిపోయిందేమో! ముఖంలో కృతజ్ఞత తాండవించే ఉంటుంది. ఇంతకీ తను ఆ సమయంలో కూడా ఆమె కళ్ళలోకి చూడలేకపోయాడు. ఆమె వదనంకూడా సరిగ్గా చూడలేదు. విశ్వానికి కొంచెం ఆశ్చర్యం వేసింది. మాట్లాడేటప్పుడు ఎదటి వ్యక్తి కళ్ళలోకి చూసి తను మాట్లాడలేడు. కారణం ఏమిటో? ఈవిషయం తను చాలాసార్లు గమనించాడు.

ఆలోచిస్తూ విశ్వం గుంటూరు వెళ్ళే రైలులో కూర్చున్నాడు. సెకండ్ క్లాస్ కంపార్ట్మెంటు వెతుక్కోటం, పోర్టర్‌కి డబ్బులిచ్చి పంపివేయటం యాంత్రికంగా జరిగిపోయాయి. రైలు కదలటానికి ఇంకా చాలా వ్యవధి ఉంది ఆలోచనలన్నీ కట్టివేసి ఆకాశంలోకి చూశాడు విశ్వం. ప్రభాతకాంతులు నాలుగు దిక్కులకీ వ్యాపిస్తున్నాయి. రాత్రంతా నిద్రలేదు. పడుకోటానికి ఖాళీ ఉన్నా రాత్రంతా ఏమేమిటో ఆలోచిస్తూ అలా కూర్చునే ఉన్నాడు. పత్రికల పేజీలు తిప్పుతుంటే అనేకానేకమైన ఆలోచనలు మనసులో మెదిలాయి. ఈ మూడేళ్ళనించి ఇంతతీరికగా గడిపినసమయం తనకి ఈ రాత్రే. ఆనర్స్ పరీక్ష తృప్తికరంగానే రాశాడు. బహుశా రెండో తరగతిలో ఉత్తీర్ణుడు కావొచ్చు. అంతకంటె తను ఎక్కువ ఆశలకి ఎప్పుడూ పోలేదు, తన సరిహద్దులు తనకి తెలుసు. తన జీవితంలో ఒక దశ గడిచిపోయింది. ఇక రెండో దశ ప్రారంభం కావాలి. జీవితరంగంలో పోటీలు, కుస్తీపట్లు మొదలైనవాటికి నాందీ ప్రస్తావన జరుగుతుంది కాబోలు. పోటీలు పడటం మానవులకి ఉగుపాలతో పెట్టిన విద్య. రానురాను అది మరీ అనివార్యమౌతోంది. ఎటువంటి ఢక్కామొక్కీలకైనా తను సిద్ధపడాలి. మొదటినించీ ప్రశాంతత అంటే తనకి ఇష్టం కాని ప్రపంచం తనని హాయిగా ఓమూల ఉండనివ్వదు. కవ్విస్తుంది; రెచ్చగొడుతుంది; జోకొడుతుంది. జనంలో తనూ ఒకడు. ఆ వ్యక్తిత్వానికి ఎన్నో సవాళ్లు. అన్యాయాలూ, అక్రమాలూ. ఆవేశాలూ, అభిమానాలూ, ఆకర్షణలూ పగ్గాల్లా తననీ రంగంలోకి ఈడుస్తాయి. రకరకాల అద్దాల్లో రకరకాలుగా తన ప్రతిబింబం ప్రతిఫలిస్తుంది. కాని ఈ అన్ని ప్రతిబింబాల్లో విశ్వం అనే వ్యక్తి - ఒక మనిషి - తనని తను గుర్తించుకోగలడా? కనీసం ఇలా ఒకసారి తను ఆలోచించాడనే విషయమైనా గురుకి రాగలదా? బహుశః తన భవిష్యత్తు ఈ ప్రశ్నపై వచ్చే సమాధానంమీదే ఆధారపడి ఉంటుంది. బుద్ధిబలంమీద విశ్వాసం ఉన్నన్నాళ్ళూ తార్కిక శక్తి వెలుగు చూపిస్తూనే ఉంటుంది. కాని నమ్మినవాటిని ఆచరణలో పెట్టటానికి ధైర్యం ఉండాలి. తనకా ధైర్యం ఒక్కటే ఉంటే చాలునని ఆ క్షణంలో విశ్వం చాలా సాధారణమైన కోరిక కోరుకున్నాడు. అస్పష్టమైన ఆలోచనలన్నీ అలా ఒక దారికివచ్చి తృప్తికరమైన ముగింపుకి ఆస్కారమివ్వటంవల్ల అతని మనస్సు తేలికపడ్డది.

"వడపూడి వారింజండీ, వడ్లపూడి వారింజకాయ అణా, కోయమంటారా బాబు?" తప్పకుండా కొంటాడనే ఆశతో ఆ పళ్ళమ్ముకునే ఆసామీ విశ్వంవంక చూశాడు. అతను పరధ్యానంగా వొద్దన్నట్టుగా తలతిప్పాడు. ఇంతలో చటుక్కున విశ్వం మనసులో ఏదో జ్ఞాపకం మెదిలింది. కోనపల్లిలో మామయ్యకి వారంజతోట ఉంది. తను స్కూల్ ఫైనల్

చదువుతున్నప్పుడు — అంటే అయిదేళ్ళకిందటిమాట— మామయ్యగారింటికి వెళ్ళాడు. అప్పటినించీ ఆ నారింజతోట అప్పుడప్పుడు జ్ఞాపకం వొస్తూనే ఉంటుంది తనకి. పాపం, ఈసారికూడా తనని వచ్చి రెండు రోజులుండిపొమ్మని ఉత్తరం రాశాడు మామయ్య. ఏమిటో ఆ పల్లెటూరు వెళ్ళటమంటే తనకంత ఇష్టం లేదు. పైగా అదో యాత్రిక ప్రయాణం. బెజవాడనించి బస్సులో రాచవరంవెళ్ళి అక్కడినించి డొంకదారిన ఏ మైలున్నరో రెండు మైళ్ళో నడవాలి. ఈ మధ్య మట్టిరోడ్డు పడ్డదని మామయ్య రాశాడు. అయినా బద్ధకిస్తూనే ఉన్నాడు ఇప్పటివరకూ, పైగా నాన్నకి కూడా అంత ఇష్టంలేదు. "ఆఁ, ఏముందిలెద్దూ అక్కడ?" అంటాడు. అమ్మే అప్పుడప్పుడు ఓసారి వెళ్ళిరమ్మని అంటూ ఉంటుంది. కిందటి మాఘ మాసంలో పద్మ పెళ్ళికి మామయ్య వచ్చినప్పుడు నిష్ఠూరం వేసిపోయాడు — ఆనర్స చదువుతో తనకి భూమ్యాకాశాలు అందటంలేదుట! ఓ సారి వెళ్ళి రావాలని అనుకున్నాడు విశ్వం. అలా అనుకోగానే "ఎప్పుడు?" అనే ప్రశ్న ఉదయించింది. ఎలాగూ విజయవాడ రానే వచ్చాడు. ఇప్పుడే ఆ ముక్కేదో తీర్చుకుంటే బావుండుననిపించింది అతనికి. ఏదైనా అనుకుంటే అది నెరవేర్చే దాకా తోచదు విశ్వానికి. వెంటనే పోర్టర్‌ని పిల్చి సామాను పట్టించమని స్టేషన్ బయటికివచ్చి జట్కా చేసుకుని ఆనందవిలాస్—బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ హౌస్—కివెళ్ళి ఓగది అద్దెకి తీసుకుని సామాన్లు అక్కడ పడేసి బస్‌స్టాండ్‌కి వెళ్ళాడు. రాచవరం వెళ్ళే బస్సులు అప్పటికే రెండు వెళ్ళిపోయాయి అని తెలుసుకుని ఓపిగ్గా బస్సుకోసం కాచుకుని కూర్చున్నాడు. అసలే బస్సుప్రయాణాలు అతనికి తలనొప్పి. పైగా తను వెళ్ళబోయే కంకరరోడ్డు అంతంత మాత్రమైనదే. ఈమధ్యనే సంపాదకునకు లేఖల శీర్షికలో విజ్ఞప్తులూ, ఆక్షేపణలూ రాచవరం రోడ్డుని ప్రజానీకం దృష్టికి తెచ్చాయి. ఎలాగైతేనేం, బస్సు కంటబడ్డది. విశ్వంలాగే మరికొంతమంది పడిగాపులు పడివున్న జనం బస్సుకోసం ఎగబడ్డారు. చేతిలో ఓ చిన్న పంచీమాత్రమే ఉండటంవల్ల విశ్వం జనాన్ని తోసుకుని ఫ్రంట్ సీట్‌లో స్థలం సంపాదించుకున్నాడు, కొంచెం తేలిగ్గానే. కుదురుగా కూర్చున్న విశ్వానికి ఆ క్షణంలో ఆశావాదంమీద కొంచెం నమ్మకం కలిగింది. జీవితంలో ఎన్నిటికోసమో ఆగాలి. చివరి దాకా ఆగే ఓపిక ఉన్న వాడికే ఫలితం దక్కుతుంది. మొదటిపాఠం నేర్చుకున్న విద్యార్థిలా విశ్వం మెరిసే కళ్ళతో జనంవైపు చూశాడు. అయితే అతని సంతోషం ఎంతోసేపు ఉండలేదు. బస్సు కదలబోయే సమయానికి పోలీస్ ఇన్‌స్పెక్టరుగారు అల్లంత దూరంలో కనిపించారు. పక్కనఉన్న కానిస్టేబిల్ బస్సు కండక్టర్‌కి దూరంనించే సంజ్ఞ చేశాడు. బస్సు ప్రయాణీకులు కొందరు విశ్వంవైపు జాలిగా చూశారు. కండక్టరు విశ్వం దగ్గిరికొచ్చి బతిమాలుతున్నట్లుగా అన్నాడు.

"సార్, ఈసీట్ ఇన్‌స్పెక్టర్‌గారికి రిజర్వ్ చేశాం. దయచేసి ఇలా కూర్చుంటారా?" అని వెనకవైపున ఓ చిన్న ఖాళీ చూపించాడు. విశ్వానికి ఒళ్ళు మండింది.

"రిజర్వ్ చేస్తే ముందు చెప్పక పోయారా?" అన్నాడు.

కండక్టర అతనిమాట వినిపించుకోలేదు. దిగక తప్పదన్నట్టుగా వెళ్ళిపోయాడు.

"సార్" అని కొంచెం జాలిగా అన్నాడు డ్రైవర్. ఇన్‌స్పెక్టర్ బస్సుకి కొంచెం దూరాన నిలబడ్డాడు. విశ్వానికి ఏం చేయటానికీ తోచలేదు. ఇన్‌స్పెక్టర్ వొస్తాడని బస్సువాళ్ళకి ముందు తెలీదన్నమాట స్పష్టం. రిజర్వేషన్‌మాట శుద్ధ అబద్ధం. అదే నిజమైతే మొదటనే తనని ఆ స్థలంలోకి రానిచ్చేవాళ్ళు కారు. కాని ఇప్పుడేం చెయ్యటం? ఈ గొడవలు తనకి తెలిసినవే. సిటీబస్ సర్వీసు ప్రయాణాల్లో అనుభవించిన పాటే. పేచీ పెట్టుకోటంవల్ల లాభంలేదు. చిరాగ్గా లేచి బస్సు వెనక సీటులో కూర్చున్నాడు తాత్కాలికాల్లో తాత్కాలికం బస్సులో ఫ్రంట్ సీట్. ఏక్షణాన అయినా ఖాళీ చెయ్యమని నోటీసు రావొచ్చు. అధికారాన్ని అసహ్యించుకునే విశ్వం ఆ క్షణాన అధికారం హస్తగతం చేసుకుని విజయంతో గర్వించాలని జీవితంలో మొట్టమొదటిసారిగా అనుకున్నాడు. అయితే అలా అనుకున్నందుకు అతను వెంటనే విచారించక పోలేదు. ఇంత చిన్న చిన్న పరీక్షలకే తను తట్టుకోలేక లొంగి

పోతే తన వ్యక్తిత్వం సంగతేమిటి? "అబ్బ, మనసు పొట్టి చెడ్డది" అని స్వగతంలో అన్నాడు విశ్వం.

ఇన్‌స్పెక్టర్ గారు కూర్చోగానే బస్సు కదిలి సాగిపోతోంది. గతుకుల్లోనించి పోతున్నప్పుడల్లా ఆ ఊపులకి తూలిపడుతున్నారు జనం. ప్రయాణీకుల్లో చాలామంది చదువుసంధ్యలు లేని పల్లెటూరిజనం. మోటుతనం వేషంలోనే కాక మాటల్లోకూడా ప్రస్ఫుటమౌతోంది. ఎవరో లంకపొగాకు చుట్ట వెలిగించాడు. ఆ పొగ సూటిగా విశ్వంమీదికి వొదిలాడు. తరవాత బస్సు కటకటాల్లోంచి తుపుక్కున ఉమ్మి వేశాడు. గాలికి ఆ తుప్పరలు విశ్వం మోచేతికి తగిలాయి. అగ్నిహోత్రుడయాడతను.

"పారెయ్యవయ్యా ఆ చుట్ట."

"ఏంటీ?"

"ఆ చుట్ట పారెయ్య మంటున్నాను."

"సిగరెట్టయితే పనికొచ్చుద్దా?" అన్నాడు ఆ ఆసామీ కోపంగా. అంత కోపంలోకూడా విశ్వానికి నవ్వొచ్చింది. తను అన్నదేమిటి, అతను అర్థం చేసుకున్నదేమిటి? ఇహ తను ఏమిఅంటే ఏం ప్రయోజనం! మనుషులు ఈ కాలంతో కూడా ఇంత అధ్వాన్నంగా ఉంటారని తను అనుకోలేదు. విశ్వం ఏమీ మాట్లాడకపోటంతో పక్కనఉన్న ఇద్దరు ముగ్గురు కలగచేసుకుని చుట్ట పారెయ్యమని ఆ ఆసామీకి సలహా ఇచ్చారు. అతను ఏమనుకున్నాడోగాని చుట్ట ఆర్పి తలపాగాలో పెట్టుకున్నాడు.

రాచవరం వచ్చిందని కండక్టరు కేకేశాడు. బస్సుబాధనుండి విముక్తి పొందాలనే తొందరలో విశ్వం బస్సు దిగబోతూ పొరపాటున గేటుపక్కన కూర్చున్న ఓ నడివయసుస్త్రీ కాలు కొంచెం తొక్కాడు. వెంటనే "చూడలేదండీ, పొరపాటు" అంటూనే ఉన్నాడు. ఆవిడ తారా మండలానికి లేచింది. పక్కవాళ్లుకూడా ఆవిడనే వెనకేసుకొచ్చారు.

"ఆడకూతురు కనపట్టం లేదంటయ్యా?" అన్నాడు ఒకాయన.

"ఓయబ్బో, కుర్రకారు కుర్రకారా ఈ రోజుల్లో?" అని రిమార్కు చేశాడింకో పెద్దమనిషి.

"కలికాలం. బ్రహ్మంగారు ఏనాడో చెప్పారు" అని విచారించాడింకొక ఆసామీ.

ఆవిడ నడివయసు స్త్రీ కనుక సరిపోయింది కాని లేకపోతే తనకి ఆ రోజుతోనే భూమ్మీద నూకలు తీరిపోయే కనిపించింది విశ్వానికి. గోరంతలు కొండంతలుగా చేసే స్వభావం మనుషులు మార్చుకోలేరేమిటని ఆశ్చర్యం వేసింది అతనికి. ఎలాగో ఆ గొడవనించి తప్పించుకుని రోడ్డుమీద చేతిసంచీతో నిలబడ్డాడు విశ్వం. చెరిగిపోయిన చిన్నబోర్డు కోనపల్లికి దోవ చూపిస్తోంది. అక్కడక్కడ చెదురుగా పొలాల్లో మనుషులు కనిపిస్తున్నారు. దూరదూరాన రెండెడ్ల బండ్లు పొలాలకి అడ్డంగా పోతూ ఉన్నాయి బహుశా మట్టిబండ్లు అయిఉంటాయి. కంకరరోడ్డు దాటి మట్టిరోడ్డుమీదికొచ్చాడు విశ్వం. దారి విశాలంగానే ఉంది. బండిచక్రాల ఇనపపట్టల చారలు రద్దీగల రస్తాయేనని చాటుతున్నాయి. దారికి రెండుపక్కలా బాగా పెరిగిన వృక్షాలు తీర్చిదిద్దినట్టున్నాయి. వాసంత సమీరం హాయిగా వీస్తోంది. మధుమాసశోభ వెల్లివిరుస్తోంది. అంటుమామిడిచెట్లు పువ్వులతో, చిన్ని చిన్ని పిందెలతో కన్నుల పండువగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ వేపచెట్లు విరబూచి కొమ్మలతో వింజామరలు వీస్తున్నాయి. దూరదూరాన వృక్షాలు రాలిపోయిన ఆకులతో మోడులుగా కన్పిస్తున్నాయి. దగ్గరగా ఉన్న చెట్లు ఎర్రటి కొత్త చిగుళ్ళతో వసంతోదయాన్ని చాటుతున్నాయి. ఆ ప్రకృతి సౌందర్య సంపదల మధ్యన నడుస్తూన్న విశ్వం ఏదో అతిలోక సౌఖ్యం అనుభవిస్తూ తన్నుతాను మర్చిపోయి కొత్త కొత్త అందాలు అన్వేషిస్తున్నాడు. బారెడు పొద్దెక్కినా దట్టంగా వ్యాపించిన చెట్లకొమ్మలు, ఆకులు ఎండ సోకనివ్వటంలేదు. ఆకుల సందుల్లోంచి సూర్యకిరణాలు వెలుగుల రవ్వలుగా జారిపడుతున్నాయి. బాటకి ఒకటి రెండు ఫర్లాంగుల దూరంలో కాలవ ప్రవహిస్తోందని ఆ ప్రాంతాల్లో నెమ్మది నెమ్మదిగా బారులుగా ఎగిరే తెల్లటి కొంగలూ, నీటికాకులూ చెప్పకనే చెబుతున్నాయి. కనుచూపు మేర దూరంలో తెరచాప కనిపించి ఆ దృశ్యాన్ని మరింత రమణీయంగా దిద్దుతోంది. కోసెడు దూరంలో ఏరు ప్రవహిస్తోంది విశ్వం హృదయంలో రసవాహిని పొంగి పొర్లసాగింది. ఎంతకాలం నించో తను బస్తీ దృశ్యాలకి అలవాటు పడ్డాడు. మోటారుకార్లూ, బస్సులూ, సైకిళ్లూ

దుకాణాలూ, సినిమా థియేటర్లూ, కృత్రిమ హావభావాలూ, పార్కుల్లో క్రమపద్ధతిన పెంచబడిన చెట్లూ, రేడియో సంగీతం, ఈగలమోతా సినిమా స్లైడ్లలాగా అతని మనోవీథిలో అవతరించి అంతరించాయి. ఎన్నాళ్లకి తను ప్రకృతి మధ్యన ఒంటరిగా తన్మయత్వంతో నిలబడగలిగాడు! ప్రకృతిసౌందర్యం గుర్తించినకొద్దీ హృదయ సౌందర్యం పెంపొందుతుంది. మానవుడి నిసర్గగుణ ప్రేమ. ఆ సహజగుణం సహజ ప్రకృతిలో భాసిస్తుంది. కృత్రిమ వాతావరణంలో నివురుగప్పిన నిప్పులా అంతర్గతంగా వెలుగుతూ ఉంటుంది. విశ్వం గట్టిగా ఊపిరి పీల్చి వొదిలాడు. ఏదో బరువు తన మీది నించి తొలగినట్టుగా ఉంది. తనేదో సత్యం కనుక్కున్నాడు. ఏదో చీకటి తెర తొలగిపోయినట్టయింది. వసంతుడు మంచు తెరలు తొలగించినట్టే తన మనసుని ఆవరించిన నీలి తెరలు తను ఒక్కొక్కటే తొలగించుకుంటున్నాడు. ఇప్పటివరకూ తను మానవుణ్ణి ద్వేషిస్తున్నాడు. విషాదభూయిష్ఠమైన అతని చర్యలు నిరసిస్తున్నాడు. అసహ్యించుకోటం అందరూ చెయ్యగలిగినపనే. కార్యకారణాలు అర్థం చేసుకోటంలోనే విజ్ఞత ఉంది.

ఆలోచిస్తూ నడుస్తున్న విశ్వం మనసులో ఓ సందేహం కలిగింది. వసంత శోభకి హృదయం ప్రఫుల్లితమై ఉదాత్తమౌతుంది. నిజం. కాని హేమంతంలో......

విశ్వం భావవీథిలో మెరుపు మెరిసింది. ప్రకృతి సౌందర్యమయమనే విషయం తను విస్మరిస్తున్నాడు. ఎండమావుల్లో, తొలకరిముత్యాల్లో, తెలిమబ్బుల్లో, మంచుతెరలో అందాలు తొలకిసలాడవా? సౌందర్యం ప్రకృతికి సహజం. ప్రేమ మానవుడికి సహజం. ఇవి రెండూ మరుగునపడితే ఇతరేతరశక్తులు విజృంభించవచ్చు. తను ప్రకృతికీ, మనిషికీ అవినాభావ సంబంధం కల్పిస్తున్నాడు. తనకు తెలిసిన అనేక విషయాల్లో ఇది సమర్థనీయమే. ఇది కొత్త సంగతేమీ కాదు. కాని తను ఈ రోజున అనుభవ పూర్వకంగా తెలుసుకుంటున్నాడు. భావనే బతుకుగా చేసుకున్న కళారాధకులు ఈ సత్యాన్ని అనుభూతి పొంది ఉంటారు. తను కళారాధకుడు కావొచ్చు. కాని కళాజీవి కాగలడా? సర్వత్రా సౌందర్యాన్ని దర్శించగలడా?

తను అనుకోకుండా పెద్ద ప్రశ్నే వేసుకున్నాడు. సర్వత్రా సౌందర్య దర్శనం! అన్నిచోట్లా, అన్నిటిలో సౌందర్యం చూడగలవాడు ధన్యుడే. అది ఆదర్శం. రససిద్ధుల కది సాధ్యమేమో. తనలాంటి సామాన్యమానవుడి సంగతేమిటి? వస్తుతః ఆర్ద్ర హృదయులైతే అప్రయత్నంగానే రసానుభవం పొంది జీవితంలో పూలబాటలు పరుచుకుని సాదరంగా ఇతరులకి ఆతిథ్యమిచ్చి జీవితసౌఖ్యం పంచుకుంటారు. కాని ఈరోజుల్లో అంతటివాళ్ళు ఎంతమంది!

ఏ మామిడికొమ్మమీదనించో కోయిల కుహూమంది.

ఆ మధుర సంగీతం విశ్వం ఆలోచనల్ని పారదోలింది. ఆ సంగీతం వినిపించినవైపు తలెత్తి చూశాడతను.

మళ్ళీ కొమ్మమీది కోయిల కుహూమంది. పరవశించాడు విశ్వం. ఆ సంతోషంలో కొంచెంగా తను కూడా 'కో' యన్నాడు.

ఎవరో రైతు కాబోలు విశ్వం పక్కనుంచివెడుతూ "మందే ఊరు?" అన్నాడు.

అందులో ఏదో ఎగతాళి గోచరించింది విశ్వానికి. "ఈ ఊరే" అన్నాడు వెక్కిరించినట్టు. ఆ రైతు కొంచెం వింతగా చూసి ఏదో అనబోయాడు. విశ్వం సరకుచెయ్యకుండా ముందుకి వెళ్ళాడు. మరుక్షణంలోనే తను అలా అన్నందుకు అతను విచారించాడు. అలా అడగటం పల్లెలో రివాజే. తను అనవసరంగా తొందరపడి అపార్థం చేసుకుని అగౌరవంగా సమాధానం చెప్పాడు. తరుచు మనుషుల లోపాలే వాళ్ళ అపార్థాలకి కారణాలు. ఇతర్ల నెత్తిమీద తమ లోపాల ఫలితాలు రుద్దటం ఘోరం. విశ్వం తన ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు.

రోడ్డుమలుపు తిరిగేసరికి బాటమీద కొంచెం దూరంలో ఏదో పనిలో నిమగ్నులైన జనం కనిపించారు. మరి కొంచెం దగ్గిరికి వొచ్చేసరికి వాళ్ళంతా రోడ్డుమీద కంకర వేసే పనిలో ఉన్నారని గ్రహించాడు విశ్వం. అతనికి కొంచెం ఆశ్చర్యం వేసింది. వాళ్లెవరూ పాటకజనంలా లేరు. అందరూ యువకులు. విద్యార్థుల్లా కనిపిస్తున్నారు. పూర్తిగా దగ్గిరి

కొచ్చేసరికి విశ్వానికి అసలు సంగతి తెలిసింది. వాళ్లందరూ కాలేజీ విద్యార్థులు. కాలేజీ సాంఘిక సేవా సమితి వేసవి శిబిరం ఈసారి ఈ ఊళ్ళో వేశారన్న మాట. విశ్వం వినోదంగా రోడ్డు నిర్మాణ కార్యక్రమం చూస్తూ నిలబడాడు. ఇంతలో ఆ శిబిరం నిర్వహించే కాలేజీ అధ్యాపకుడు ఆ వైపుకి వచ్చాడు. విశ్వం ఆయనకి పాత విద్యార్థి. 'నమస్కారం మాస్టారూ!' అన్నాడు విశ్వం.

"ఏమోయ్, ఇలా వచ్చావు, ఏంచేస్తున్నావిప్పుడు?" అడిగాడాయన.

"ఎకనమిక్స్ ఆనర్స్ పరీక్షకి వెళ్లానండి."

"అలాగా బాగా రాశావా?"

"బాగానే రాశానండి."

"సంతోషం. ఇలా వొస్తున్నావేమిటి కథ?"

తన మేనమామ ఊరు అదేననీ, చుట్టపు చూపుగా చూసిపోటానికి వచ్చాననీ చెప్పాడు విశ్వం. ఆ అధ్యాపకుడు కొంచెం చనువుతీసుకొని అన్నాడు.

"అయితే నువ్వూ ఒకవిధంగా ఈ ఊరువాడివే మరి మా ఊరిపనిలో నువ్వు లేకుండా ఎలా? శ్రమదానం చేసితీరాలిసిందే!" అన్నాడు.

విశ్వం చిరునవ్వు నవ్వాడు. తను ఆ కాలేజీలో చదివినప్పుడు ఇటువంటి కార్యక్రమాల్లో కొన్నిసార్లు పాలొన్నాడు. మాస్టరుగారు తనని ప్రత్యేకించి ఆ జ్ఞాపకంతోనే బలవంతం పెడ్తున్నారని తనకి తెలుసు.

"ఏమిటోయ్ తటపటాయిస్తావు. అదిగో, ఆ పార పుచ్చుకో పద. నేనూ వొస్తున్నాను" అని హుషారిచ్చాడు అధ్యాపకుడు. ఆయనమీద గౌరవంవల్లనైతేనేం, ఆ సమయంలో తనకీ ఉత్సాహం కలగటం వల్లనైతేనేం విశ్వం రంగంలోకి దూకాడు.

ఉదయం సుమారు తొమ్మిదిన్నరగంటలు కావస్తోంది. అలిసిపోయాడు విశ్వం. పార పక్కన పడేసి తన వేషం చూసుకుని అదిరిపోయాడు. తెల్లటిషర్టూ, ట్రౌజరూ ఎర్రగా ఐపోయాయి. నలిగిపోయాయి. ఈ అవతారంతో మామయ్యగారింటికి వెళ్లటం ఎలా? తనకి ముందుచూపు బొత్తిగా తక్కువ. తనని చూడగానే మామయ్య "ఎవరోయ్, గ్యాంగ్ కూలీవా?" అనడుగడా! ఏంచేయటం? ఆస్థలంలోగానీ, ఇంకెక్కడగానీ ఇంటికి వెళ్ళేలోపున బట్టలు మార్చుకోటం అసంభవం.

"ఏమోయ్, వెడతావేమిటి?" అన్నాడు అధ్యాపకుడు.

"అవునండి"

"అలసిపోయావు. వెళ్లు. మళ్ళీ కనిపిస్తావుకదూ. విష్ యూ గుడ్ లక్" అన్నాడాయన.

విశ్వం సెలవుతీసుకుని కాళ్ళీడ్చుకుంటూ తల వొంచుకుని ఇల్లు చేరుకున్నాడు. మామయ్య ఇల్లు తనకి బాగా గుర్తే. పెద్దమర్రిచెట్టు దాటగానే చెరువు, చెరువు పక్కనేఉన్న పెద్ద మండువాఇల్లు. అదే ఆయన నివాసం.

సంకోచిస్తూ ఓరగా వేసి వున్న తలుపు నెట్టి లోపలికి ప్రవేశించాడు విశ్వం. పెద్ద ఆవరణ. బాదం చెట్టూ, పూలమొక్కలూ. ఓమూల గొడ్లపాకా అవన్నీ తనకి బాగానే జ్ఞాపకం ఉన్నాయి.

గొడ్లదగ్గిర మేత సరిజేస్తూ బట్టలకంటిన గడ్డి పరకలు దులుపుకుంటున్న వెంకట్రామయ్యగారు తలుపు చప్పుడు విని తలెత్తిచూసి కేకేశారు.

"ఎవరోయ్ అది?"

గోడకి పిడకలు కొడుతూ ఆ కేక విని సీతమ్మగారు వెనక్కి తిరిగి విశ్వంవైపు ప్రశ్నార్థకంగా చూసింది.

పడమరదిక్కున ఒకమూల బావిచప్టా మీద బట్టలు జాడించుకుంటున్న అమ్మాయి, జానకి, ముంగురులు వెనక్కి తోసుకుంటూ, స్వేదబిందువులు తుడుచుకుంటూ పక్కకి తిరిగిచూసింది.

పలుగు నేలమీద మోపుకుంటూ, ఎగకట్టిన పంచెతో వీధిలోంచి అప్పుడే వొస్తున్న సూరి విశ్వంవైపు పరకాయించి చూశాడు.

వీళ్లందర్నీ చూసి విశ్వం చిరునవ్వు తెచ్చుకుని పెదిమలు కదిలించబోయే లోపుగా వెంకట్రామయ్యగారే కేకేశారు.

"ఓరి నువ్వట్రా" మన విశ్వమేనట్రా, అలా చూస్తారేం?"

"అంతా బావున్నారా నాయనా?" అంది సీతమ్మ.

"ఆ. బాగానే వున్నారత్తయ్యా." అన్నాడు విశ్వం. వెంకట్రామయ్యగారు పకపక నవ్వుతూ, "ఇదేం వేషంరా?" అన్నారు.

"ఎక్కడ పడ్డావయ్యా బావా?" అన్నాడు సూరి.

"కాళ్ళు కడుక్కోటానికి బావకి నీళ్లివ్వవే జానకీ, అలా పిచ్చి మొద్దల్లే చూస్తావేం?" అంది సీతమ్మగారు.

విశ్వం ఉక్కిరిబిక్కిరి అయాడు.

జానకి చెంబుతో నీళ్ళుతెచ్చి దగ్గిర పెట్టింది. ఆమెవైపు అప్రయత్నంగా చూశాడు విశ్వం. తలంటి పోసుకున్నట్టుంది. జుట్టు చుట్టచుట్టుకుని వదులుగా ముడివేసుకుంది. చెంపలమీద ముంగురులు జారిపడుతున్నాయి. శరీరం తీగలా వంగి స్ప్రింగ్‌లా చివాలున మళ్ళి వెనక్కి వెళ్ళింది.

"ఈ అమ్మాయి మన జానకేనా?" అన్నాడు విశ్వం. ఆ మాటలు అతని నోటినించి ఎలా జారాయో అతనికే తెలియదు.

"నుంచున్న పళంగా పెళ్లి చేసెయ్యగ లేవయ్యా, అలా భయపడతావేం, ముందు కాళ్లు కడుక్కో" అంది సీతమ్మగారు ముసిముసి నవ్వులతో.

విశ్వం సిగ్గుపడ్డాడు. చెంబెడు నీళ్ళూ కాళ్ళమీద దొర్లించుకుని అక్కడికి చేరువలోనే వాల్చివున్న మంచంమీద కూలబడ్డాడు. జానకి ఎంతలో ఎంత మారిపోయింది! పద్మ పెళ్ళికి వీళ్ళందర్నీ చూశాడు గాని జానకిని చూడలేదు. ఏదో కారణంవల్ల రావటానికి వీలుపడలేదన్నారు. ఇంతలోనే గుర్తుపట్టటానికి వీల్లేకుండా మారిపోయింది. ఎంత ఆశ్చర్యం!

"ఈ వేషమంత ఏమిటో చెప్పనేలేదే!" అన్నాడు సూరి. విశ్వం ఆలోచనలోంచి తేరుకుని జరిగిన విషయం చెప్పి అన్నాడు.

"ఛ. ఛ. వెధవపని, ఇక నా జన్మలో చెయ్యను. ఊళ్ళోకి రావటానికే సిగ్గుపడి చచ్చాను అనుకో."

సూరి బిగ్గరగా నవ్వాడు.

"మా సొంత పనులకోసం ఒళ్లు విరుచుకుంటూ అదే ఎంతో గొప్ప అని మేమూ, అందరూకూడా అనుకుంటూంటే నువ్వు ఇతర్లకోసం శ్రమపడికూడా సిగ్గుపడతావేమిటోయ్ బావా?"

ఆ మాటల్లో ఏదో అర్థం మెరుపులా మెరిసి వెలుగు కనిపించినట్టయింది విశ్వానికి. తనుపొరబడ్డాడు. తను ఎంతసేపటికీ తననుగురించి ఇతర్ల దృష్టులు ఆధారంగా ఆలోచించటం ఎందుకో తనకి అర్థంకావటం లేదు. తననిగురించి తన అభిప్రాయంకంటె ఇతర్ల అభిప్రాయాలకి విలువ ఇస్తున్నాడు. అంటే తననిగురించి ఇంతవరకూ ఒక నిర్దిష్టమైనఅభిప్రాయం తనకి లేదన్నమాట. విషయం తిప్పిస్తూ వెంకట్రామయ్యగారు అడిగారు.

"ఎక్కడినుంచి రావటం?"

"వాల్తేరునించి."

"ఏం, అంత బుద్ధి కుదిరింది? ముందురాసే బండీ పంపేవాణ్ణిగా."

"ముందు అనుకోలేదు."

"అంటే ఎగ్గొట్టాలనే అనుకున్నావన్నమాట. సరేలే, ముందు స్నానం చెయ్యి. తరవాత తీరిగా మాట్లాడుకుందాం. పండుగపూట వచ్చావు, అదేచాలు"

సూరి స్నానాలగదికి దారితీశాడు. విశ్వం అనుసరించాడు.

స్నానంచేసి బట్టలు వేసుకుని హాల్లోకి రాగానే బల్లమీద అద్దం, దువ్వెనా పెట్టి వెళ్ళింది జానకి. మళ్లీ వెంటనే వచ్చి హేరాయిల్ సీసా బల్లమీద పెట్టి వెళ్ళబోయింది.

"ఇవన్నీ నాదగ్గర ఉన్నాయి."

"ఇక్కడా ఉన్నాయిగా."

విశ్వం ఇంకేమీ అనలేదు. జానకి కూడా అక్కడ లేదు. ఏదో మాటాడాలనిపించింది విశ్వానికి. కాని ఏదో అడ్డుపడుతోంది. ఈ జానకితో నేనా మొన్న మొన్నటిదాకా తను అంత స్వేచ్ఛగా మాట్లాడింది. వయసులో మార్పు ఎన్నివిషయాల్లో మార్పు తెస్తుంది!

వరండాలోకి వచ్చాడు విశ్వం. అప్పటికే పేపరువచ్చినట్టుంది. వెంకట్రామయ్యగారు పడక కుర్చీలో జేరబడి చదువుతున్నారు. పలుగు తలకిందులుగా పాతి కొబ్బరికాయల పీచు తీస్తున్నాడు పాలేరు వెంకన్న. సూరి సహాయం చేస్తున్నాడు.

"ఏమిటి మామయ్యా విశేషాలు?"

వెంకట్రామయ్యగారు తలెత్తి చూసి "కూర్చోరా" అన్నాడు.

ఇంతలో సీతమ్మగారు వచ్చి బాదంఆకు ఒకటి అందిస్తూ, "ఇదికొంచెం నోట్లో వేసుకో నాయనా" అంది.

"ఏమిటత్తయ్యా ఇది?"

"ఉగాది పచ్చడి."

విశ్వం మారుమాట్లాడకుండా రుచిచూశాడు.

"కొత్తసంవత్సరం నీకు బాగా యోగిస్తుంది లేవోయ్." అన్నారు వెంకట్రామయ్యగారు.

"మీ అందరికీ కూడా" అన్నాడు విశ్వం.

అప్పుడేవొస్తున్న సూరి అందుకున్నాడు. "మాదేమిటిలే. నీకు మంచి గిరాకీ తగుల్తుంది. సంవత్సరం పొడుగునా సాంఘికసేవ చేస్తూనే ఉంటావులే."

నవ్వాడు విశ్వం.

ఏడాదికి తొలిరోజున తొలిఘడియలు సంతృప్తికరంగానే గడిచాయి తనకి. ఈ కొత్తసంవత్సరం పాతబడేసరికి తన జీవితంలో ఏయే మార్పులు జరుగుతాయో! తీపి, చేదు, వగరు, పులుపుల మిశ్రమమే జీవితం అని ఉగాది పచ్చడి హెచ్చరిక చేసింది. అందులో వేసిన ఆ యేటి కొత్త ఫలపుష్పాలు జీవితపు కొత్త అనుభవాల సంపుటికి ప్రారంభోత్సవం చేశాయి.

2

భోజనానంతరం కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకుని మంచంమీద వెన్ను వాల్చగానే తనకు తెలియకుండానే కునుకు పట్టింది విశ్వానికి. లేచి చూస్తే సూర్యుడు పడమటికి తిరిగి ఉన్నాడు. రిస్ట్‌వాచి చూసుకున్నాడతను. అప్పుడే నాలుగు దాటింది. అంతా పనులమీద ఉన్నట్టున్నారు. దగ్గర ఎవరూ లేరు. కొంచెం దూరంలో పాలేరు వెంకన్నమాత్రం కొబ్బరికాయల పీచు తీసే పనిలో నిమగ్నుడై వున్నాడు. అతనిని చూడగానే విశ్వానికి జాలేసింది. పండగపూటకూడా అతనికి పని తప్పదల్లే ఉంది.

విశ్వం నిద్ర లేవటం వెంకన్న చూశాడు.

"ఏం బాబూ లేచారా?" పలకరించాడు.

"ఊఁ" అన్నాడు విశ్వం.

వెంకన్న ఓ కొబ్బరి బొండం బరువు చూసి చెక్కి రంధ్రం చేసి విశ్వానికిస్తూ అన్నాడు.

"దాహం పుచ్చుకోండి, బాబూ. మా చెడ్డ ఎండగా ఉంది."

విశ్వం అడ్డు చెప్పలేదు.

"మన తోటలో కాయేనండి. ఇయ్యంటే ఊళ్లోవాళ్లు ఎగబడతారనుకోండి."

మన తోట...!

ఇద్దర్నీ కలిపి మాట్లాడుతున్నాడు వెంకన్న. నిజానికా తోట ఇద్దరిలో ఎవరిదీ కాదు. పాపం, శ్రమ చేసేది తనే కనుక ఆదోరకమైన తృప్తి పొందుతున్నాడు కాబోలు. ఈ దేశంలో శ్రమకి ఫలితం దక్కటం అంత సులభంగా జరిగేది కాదు. సానుభూతి చూపిస్తూ అన్నాడు.

"పండగనాడుకూడా పనేమిటోయ్, హాయిగా విశ్రాంతి తీసుకోక?"

"పండగైతే పని చేయకూడదా బాబు? పని చెయ్యకపోతే నాకు వొళ్లు ఇరగొట్టేసట్టుంటది."

"అంత చెయ్యాలని ఉంటే సొంత పనేదైనా చేసుకోకూడదూ?"

"ఇది సొంత పని కాదంటండీ?"

అమాయకుడల్లే ఉన్నాడు. ఆంధ్రదేశం రాజకీయంగా ఎంతో ముందున్నదని తను అనుకుంటున్నాడు. చైతన్యవంతమైన ప్రజ అని గర్వపడేవాడు. పీడక శక్తుల్ని గురించి ఏమీ తెలియనట్టు మాట్లాడతాడేం ఇతను!

"నువ్వు వట్టి అమాయకుడివోయ్."

వెంకన్న చిరునవ్వు నవ్వాడు.

"అయితే ఆ తప్పు ఆసామీగారిదేనండి. ఆరితోనే చెప్పండి ఆమాట"

విస్తుపోయాడు విశ్వం. అతనేదో మర్మగర్భితంగా మాట్లాడుతున్నాడు. అతనలా అంటాడని తను ఏమాత్రం ఊహించలేదు.

"అంటే?" అన్నాడు అర్థం కానట్టు తెలియచేస్తూ.

అప్పుడే అటువైపు వస్తున్న సూరివైపు చూపిస్తూ అన్నాడు వెంకన్న.

"అదుగో చిన్నాయన వస్తున్నాడు. ఆయన్నే అడగండి. ఏం చిన్నయ్యా, నన్ను వెర్రిబాగులోణ్ణి చేసింది ఎవుళ్ళు, నువ్వు చెప్పు."

విశ్వం అప్రతిభుడయ్యాడు. మనుషులు పైకి కన బడేటంత తెలివితక్కువ వాళ్లు కారు! సూరి నవ్వుతూ అడిగాడు.

"ఏమిటి బావా నీ సందేహం?"

"ఏం లేదు లే."

వెంకన్న వైపు తిరిగి సూరి అన్నాడు.

"వెంకన్నా, కడవతో నీసు పెట్టు. బావ ముఖం కడుక్కుంటాడు."

విశ్వం లేచాడు. వెంకన్న నీళ్లు తోడి ఇచ్చాడు. ఆ చల్లటి ఉదకం తగలగానే నిద్రబరువు పూర్తిగా తొలగిపోయి శరీరంలో కొత్తశక్తి వచ్చింది విశ్వానికి.

జానకి కాఫీ కప్పుతో వరండాలో నిలబడి తట పటాయించటం చూశాడు విశ్వం. దగ్గిరికి వచ్చాడు. ఆమె కాఫీ కప్పు బల్లమీద పెట్టి వెళ్లిపోయింది. ఈ కొత్తదనం ఏమిటో అసహజంగా కనిపించింది విశ్వానికి.

కాఫీ త్రాగాడు.

"ఊరిమీద తిరగటానికి సిద్ధమేనా?" అన్నాడు సూరి.

"మావయ్య ఏడీ?"

"ఏదో పనిమీద బయటికి వెళ్లారు. అలా తిరి గొద్దాం పద, ఓపిక ఉంటే."

ఇద్దరూ బయల్దేరారు. ఎదురైనవాళ్లు విశ్వం వైపు పరకాయించి చూస్తున్నారు. నడుస్తూ ఊడల మర్రి సమీపించారు. బోదెచుట్టూ అరుగు కట్టారు. దగ్గిరలోనే కిల్లీ దుకాణం లాంటి కొట్టు ఒకటుంది. దానికెదురుగా ఉన్న ఓ చిన్న పెంకుటింటిముందు 'యువజన గ్రంథాలయం' అనే బోర్డు ఉంది. మర్రిచెట్టు ఆకుల్లోంచి దూసుకొచ్చిన కర్రలకి ఏవో రాజకీయ పార్టీలు జండాలు కట్టబడి కొంచెం ఎబ్బెట్టుగా కని పిసునాయి దూరంలో గుడి గోపురం, ధ్వజస్తంభం కనిపిస్తున్నాయి. గుడికి పక్కగా ఉన్న ఖాళీస్థలంలో కొంత మంది గుమిగూడి ఏవో ఆటలు ఆడుకుంటు న్నారు. ఈ దృశ్యాలన్నీ విశ్వం పరిశీలగా చూస్తు న్నాడుకాని, సూరి కళ్లు ఎదురుగా రచ్చబండమీద ఉన్న యువకులమీదే ఉన్నాయి. వాళ్ళని సమీ పించగానే విశ్వానికి అందర్నీ పరిచయం చేశాడు. వాళ్ళందరికీ ఏవేవో కొత్త సంగతులు చెప్పి వాళ్ళలో ఉత్సుకత కలగచేయాలని మొదట విశ్వం అను కున్నాడు. కాని కొద్ది నిమిషాల సంభాషణ తరవాత వాళ్ళెవరూ తను మాట్లాడేది సరిగా వినటమే లేదని విశ్వం గ్రహించి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. మరికొంతసేపటికి తను అనే ఓ కొత్తవ్యక్తి అక్కడ ఉన్నాడనే విషయమే వారు పట్టించుకున్నట్టు లేదు. తనకి తలనొప్పి పుడుతోంది. లేకపోతే, స్కూలు కమిటీ మెంబర్ల గొడవలూ, గుడి మరమ్మత్తు వనూళ్ళ కైంకర్యాలూ, బంజరు తగాదాలూ మొదలైనవన్నీ తన కెందుకు?

విశ్వం విసుగుదల కనిపెట్టి సూరి లేచి నుంచున్నాడు.

"ఊళ్ళో గుడిపగిర పోటీలుపడి చెడుగుడు ఆడుతున్నార్ట, చూద్దాం పదండి." అని హెచ్చరించా డతను మిత్రుల్ని. కొంతమంది నిరుత్సాహపడ్డారు. చివరికి ఎక్కువమంది కదలడానికే నిశ్చయించుకుని చెడుగుడుపందెం జరుగుతున్నచోటికి వెళ్లారు.

ఆట మంచి జోరుగా ఉంది. సమ ఉజ్జీలు. అటూ ఇటూ పైజనం హుషారిస్తున్నారు. ఉద్రేకాలూ, ఆవేశాలూ పెరుగుతున్నాయి. ఆటగాళ్లు రాను రాను వెల దగ్గిరే కాచుకుంటున్నారు. కూతకి వెళ్ళినవాడు పాయింటు ఇవ్వటమో, తేవటమో జరుగు తోందిగాని ఊరికే రావటం లేదు.

ఉన్నట్టుండి పెద్ద సందలనం రేగింది. "ఏమి టేమిటి?" అంటున్నారు కొంతమంది. "ఘోరం, అన్యాయం" అని ఖండిస్తున్నారు మరి కొంతమంది.

"ఏంజరిగిందిరా సూరీ?" ఆదుర్దాగా అడిగాడు విశ్వం.

"తలకాయ పగిలింది" అన్నాడు సూరి తాపీగా, అదేం పెద్దవిషయం కానట్టు.

జనం మూగుతున్నారు.

"ఎవరిది ?"

"ఎవరిదో లే. చెబితేమాత్రం నీకేం తెలుస్తుంది."

"అంత దుడుకుగా ఆడకపోతే యేం ?"

"నీ కీ వివరాలు తెలియవులే. అంతా ప్లాను ప్రకారమే జరిగింది."

"అంటే, ఇలా జరుగుతుందని నీకు ముందే తెలుసా?"

"ఊహించాను. ఒకమాట చెబుతాను విను. ఇక్కడ అకస్మాత్తుగా ఎవరికీ ఏమీ తెలియకుండా జరిగే విషయాలు బహు తక్కువ."

"అసలేం జరిగింది?"

"చెప్పాను కదూ! వెలతాకినా తొక్కటం దేనికి మనిషిని? అందరూ మీదపడితే ఏమవుతాడు, పాపం! ఓడించి గెలిచెయ్యాలని ఆట ఏర్పాటు చేశారు, ఓడిపోయారు అదీ సంగతి."

"ఏమిట్రా ఈ తగాదాలు చిన్న పిల్లల్లాగా?" నూరి నవ్వాడు పొడిగా.

"పార్టీలు బావా పార్టీలు."

"ఏం పార్టీలు?"

"ఏ రాయైతే ఏం తల పగలకొట్టుకోటానికి? ఏవో పార్టీలు. పబ్లికువి. ప్రయివేటువి."

సంచలనం పెద్దదైంది. మాటలు రెండువైపులా తూలుతున్నారు. సర్దటానికి మనస్ఫూర్తిగా ఎవరూ ప్రయత్నిస్తున్నట్టు లేదు. వ్యవహారం చేతులు కలిసేదాకా వొచ్చేట్టుంది.

"సర్దుబాటు చెయ్యడానికి ప్రయత్నిద్దాం పద" అన్నాడు విశ్వం.

"ఇక్కడ నీ మాట ఎవరూ వినరు."

"చూద్దాం."

"లాభం లేదు. ఇంకో రహస్యం చెప్పమన్నావా? ఇక్కడ సర్దుబాటు చేసేట్టు కనిపించేవాళ్లకి వ్యవహారం అంత త్వరగా సర్దుబాటు కావటం ఇష్టం వుండదు. దెబ్బ జరిగి కాస్త తమాషా చూస్తేగాని వాళ్లకి తృప్తివుండదు. పన్ను లేకుండా వినోదం చూడొచ్చు కదూ మరీ." వ్యంగ్యంగా నవ్వాడు నూరి.

"ఇలా ఊరికేవుంటే మనం ఆ తరగతిలోనే చేరుతాము" అన్నాడు విశ్వం.

"నామాట విని నువ్వు కాసేపు ఆ గుళ్లో కూచో నేనిప్పుడే వొస్తా." అనేసి విశ్వం సమాధానం కోసం ఎదురు చూడకుండానే గుంపులో కలసి ఓసారివెనక్కి తిరిగి విశ్వాన్ని వెళ్లమన్నట్టుగా చెయ్యి ఊపాడు.

ఈ ఉపద్రవానికి విశ్వం మనసు కొంచెం దెబ్బతింది. అతను విషాదగ్రస్త వదనంతో గుడివైపుకి అడుగులు వేయసాగాడు. జనం వాదించుకుంటూనే ఊరివైపు సాగుతున్నారు.

కొంపదాకావచ్చి ఆగాడు విశ్వం. శ్రావ్యమైన కంఠం వినిపిస్తోంది. పురాణకాలక్షేపం జరుగుతోంది...

అఖిలరూపముల్ దనరూపమైనవాడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాడు
భక్తజనముల దీనులపాలివాడు
వినడె చూడడె తలపడె వేగరాడె.

గజేంద్రమోక్షం. అలాగే వింటూ నిలబడ్డాడు విశ్వం. చిన్నప్పుడు తను కంఠోపాఠం చేసిన పద్యం. అప్పుడు తనకి అర్థం తెలియదు. ప్రార్థన పద్యమని తెలుసు. గుర్తుకి తెచ్చుకున్నాడు మొదటిపాదం...

కలుగడే నాపాలికలిమి సందేహింపఁ
గలిమిలేములు లేక కలుగువాడు...

తనకి చాలా ప్రీతిపాత్రమైన పద్యం. ఏదో హాయిగా ఉండేది చదువుతుంటే. అప్పుడు తనకు భక్తిఅంటే ఏమిటో తెలియదు. కనుక అది ఉండాలనుకునేవాడు. కాని ఇప్పుడు తను పూర్వపు విశ్వం కాదు. యుక్తాయుక్తాలు తెలిసినవాడు. పూర్వాపరాలు విచారించగలవాడు. ఇప్పుడా పద్యం వింటుంటే తనకి పూర్వపు అనుభూతికలగటం లేదు.

పురాణ కాలక్షేపం జరుగుతూనే ఉంది.

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె..." వినమ్రుడై గజేంద్రుడు వేడుకుంటున్నాడు. అలా వేడుకోటం విశ్వానికి ఇష్టం లేదు.

ఆలోచిస్తూ నిలబడ్డాడు విశ్వం. కొంచెం సేపట్లో పురాణం ఐపోయింది. గుడిగంటలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరే బయటికి వెడుతున్నారు. గుడిలోపలికి వెడితే మండపంమీద హాయిగా కాసేపు కూర్చోవచ్చుననిపించింది విశ్వానికి. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ చేరుకోసాగాడు. అలా వెడుతూ యథాలాపంగా తలెత్తిచూసి, మళ్ళీ అలాగే అటువైపే చూసి నిలబడిపోయాడతను. జానకి! పట్టుచీర కట్టుకుని అరచేతిలో పళ్లెం బుజా

నికి సమీపంగా పట్టుకుని ఎడం చేతిలో పూలసజ్జతో భాగవతారిణిలా కనిపిస్తోంది. వాలు జడలో పచ్చగన్నేరుపూలు తురుముకుంది. ఈ వేషం చూసి ఆశ్చర్యపోయాడు విశ్వం. అతనిని అకస్మాత్తుగా చూసి జానకి కొంచెం చకితురాలై ఆగింది.

“సూరేడీ?”

ఒక్కొక్కసారి సూరిని అన్నయ్యఅనీ, ఇంకోసారి సూరీ అని పిలుస్తుంది జానకి.

“ఎక్కడికో వెళ్లాడు.”

“దేవుణ్ణి చూస్తావా?”

“ఊహుఁ.”

“ఏం?” కొంచెం ఆశ్చర్యపడి అడిగింది జానకి.

“నాకు కనపడడు కనుక.”

జానకికి అర్థమైంది.

“పూజారి ఉన్నాడు” అంది కొంచెంకొంటెగా.

“ఆ కాలింగ్ బెల్ కొట్టటానికి నాకు ఓపిక లేదు.”

“మాటలు నేర్చుకున్నావే!”

“నువ్వు భక్తురాలివి కాబోలు.”

“నీకు భక్తి లేదా?”

“చెప్పులమీద ఉంది.”

జానకి ముఖం చిట్లించుకుంది.

“సరిగ్గా మాట్లాడరాదూ?”

ఇంటిదగ్గిర బిడియపడి ఇక్కడ ఒంటరిగా ఉన్నప్పుడు ఇంత స్వేచ్ఛగా ఆమె మాట్లాడటం విశ్వానికి ఆశ్చర్యంగా ఉంది. కావాలని తెచ్చిపెట్టుకునే లక్షణం కాకపోతే అసలు సిగేమిటి!

“నాకు నమ్మకంలేదు ఇటువంటి వాటిమీద.” అన్నాడు విశ్వం.

“అలా చెప్పు.”

“నేను రౌరవాది నరకాలనుభవిస్తావని నువ్వు భయపెడుతున్నట్టున్నావు.”

“ఊహుఁ.”

“ఏం? మరి నాకు భక్తి లేదుగా?”

“మంచివాళ్లకి భక్తి ఉన్నా లేకపోయినా పరవాలేదులే.”

“నేను మంచి వాడినా?”

“కాదా?”

“కాదేమో! నీకేం తెలుసు“”

“మంచి వాడివి కాకపోతే టికెట్ పారేసుకున్న వాళ్ళకి సొంత డబ్బుతో విసుక్కోకుండా టికెట్ కొనిస్తావా?”

అప్రతిభుడయ్యాడు విశ్వం.

“అలా కొయ్యబారి పోతావేం?” అంది జానకి నవ్వుతూ.

“ఈ విషయం నీకెలా తెలుసు?”

“ఇటువంటివి తెలియకుండా ఉంటాయా?”

“నే నెవరికీ చెప్పలేదే! కొంపతీసి ఆ అమ్మాయిది కూడా ఈ ఊరే నేమిటి?”

“ఊఁ”

“నీకు తెలుసన్నమాట ఆమె ఎవరో.”

“ఊఁ”

“ఎవరు?”

“ఎవరైతే ఏం?”

“ఊరికే తెలుసుకుందామని, ఆ అమ్మాయి ఎవరైతే ఏంగాని ఉట్టిమర్యాదా మట్టూ లేని మనిషి, జానకీ”

జానకి కొంచెం ఆశ్చర్యంగా అంది.

“కాదే!”

“కాకపోవట మేమిటి? అంత సహాయంచేస్తే కనీసం కృతజ్ఞతయినా చెప్పలేదు.”

“ఓహో; అయితే నువ్వు పెద్దసహాయమే చేశావన్నమాట.”

విశ్వం కొంచెం సిద్దపడ్డాడు. తనేదో మహాత్యాగం చేసినట్లు మాట్లాడాడు. తన ఉద్దేశం అదికాకపోయినా.

“చేశానని కాదు, సంగతి చెబుతున్నాను. పైగా నేనేదో అబద్ధం చెప్పుకున్నానని ఆవిడ గునిసింది. నాకోసమైనట్టు. ఆమె అబద్ధాలాడదు కాబోలు, పాపం.”

“ఆడదు” అంది జానకి.

“అయితేమాత్రం!” అన్నాడు విశ్వం కొంచెం ఉక్రోషంగా. “ఇంతకీ ఆ అమ్మాయి ఎవరో చెప్పావు కాదే!”

"ఏం? కృతజ్ఞత తెలియచెయ్యమని ఉత్తరం రాస్తావా? ఆ అమ్మాయిపేరు జానకి."

తెల్లబోయాడువిశ్వం. అతనికళ్లలో అపనమ్మకం గోచరించింది.

"జానకా?"

"అవును. జానకి, అంటే నేనే."

నవ్వింది జానకి, కొద్దిక్షణాలు ఏమీమాట్లాడలేక పోయ్యాడు విశ్వం.

"నిజమా? నేను గుర్తుపట్టలేకపోయాను."

"అందుకే నువ్వు మంచివాడివి."

"నువ్వురాజమండ్రి ఎందుకు వెళ్లావు?"

"వెనక మాఇంటిపక్కన ఒక డెప్యూటీ" పంచాయతీ ఆఫీసర్ గారుండేవారు. ఆయన కూతురు నాకు ముఖ్యస్నేహితురాలు. ఆ అమ్మాయి పెళ్ళికి నన్ను తప్పక రమ్మనమని బలవంతించేస్తే వెళ్లాను. వాళ్లు ఈమధ్యనే రాజమండ్రి బదిలీమీద వెళ్లారు."

"అలాగా ఒంటరిప్రయాణమంటే నీకు భయం లేదన్నమాట"

"భయమెందుకూ? బెబ్బులి ఎత్తుకుపోతుందా? పాలానికి ఎన్నిసార్లు ఒంటరిగా వెళ్ళి రావటం లేదు!"

"టికెట్ పోతే మరి అంత గాభరాపడ్డావేం?"

జానకి సమాధానంఇవ్వలేదు. చిరునవ్వు నవ్వింది.

"రైల్లో నన్ను గుర్తుపట్టావా?" అనుమానంగా అడిగాడు విశ్వం.

"అనుమానించాను."

"నేను చాలా మారానని అందరూ అంటారే!"

"పోలికలు ఎక్కడికిపోతాయి?"

కొంచెం చిలిపిగా విశ్వం ముక్కువైపు చూసిందామె.

"నాది గరుత్మంతుడి ముక్కు కదూ?" నవ్వుతూ అన్నాడు విశ్వం. జానకి చిన్నప్పుడు తనని అలాగే వేళాకోళం చేసేది.

'అని నేననలేదే!' ముసిముసిగా నవ్వింది జానకి.

"నేనుమాత్రం నిన్ను గుర్తుపట్టలేకపోయాను."

"మగవాళ్లకి మరుపెక్కువ."

"అనుమానంచినదానివి పలకరిస్తే తేలిపోయేదిగా."

"ఒక వేళ నువ్వు కాకపోతే?"

"ఏం కాకపోతే, ఇంతలోకే కొంపలంటుకుంటాయా?"

సమాధానం అనవసరం అన్నట్టుగా జానకి ఊరుకుంది.

"సమయానికి నేనున్నానుకనుక సరిపోయింది గాని లేకపోతే అవస్థపడేదానివే"

"అప్పుడు టికెట్ పోయేదికాదులే."

"అన్నీ మన వీలుప్రకారం జరుగుతాయా?"

"నువ్వున్నావుకనుకే టికెట్ పోయిందేమో."

"అదేమిటి?"

"లేకపోతే నువ్వు మేగజైన్‌మీద రాసుకున్న నీపేరూ, లెదర్ బ్యాగ్ మీద రాసుకున్న అడ్రసు చూడటానికి వీలు అయేదికాదుగా."

వింతగా చూశాడు విశ్వం. అనుమానిస్తూ అన్నాడు. "అయితే అంతా నాటకమేనా?" విస్మయం అతని ముఖంలో తాండవించింది. జానకి చిరునవ్వు నవ్వింది. దాంతో అతని అనుమానం రూఢిఅయింది.

"నువ్వు అబద్ధాలు చెప్పవుగా" అన్నాడువిశ్వం కొంచెం కోపంగా.

"ఏం, గుంజీలు తియ్యాలా!"

ఆ మాటల్లో ఏదో వ్యంగ్యం ఉంది. తటుక్కున విశ్వం స్మృతి పథంలో ఒకదృశ్యం. మెదిలింది. పూర్వం ఒకసందర్భంలో జానకి అబద్ధం చెప్పిందని "అబద్ధమాడరాదు" అనిపిస్తూ ఆ పిల్లచేత వరసగా కాళ్ళునెప్పి పుట్టేట్టు గుంజీలు తీయించాడు.

"అబద్ధమా?" అని రైల్లో జానకి అన్నమాటలో అదే చిలిపితనంతో కూడిన ఎత్తిపొడుపు. విస్తుపోయాడతను. చాదస్తురాలు, అమాయకురాలు అనుకొన్న జానకిలో ఇంత గడుసుతనం ఉందనుకోలేదు.

"ఏమిటి బావా! ఆలోచిస్తున్నావు?" అంది జానకి.

"ఏంలేదులే." అన్నాడు.

"నిజంగా గుళ్ళోకి వెళ్లవా?"

"ఉఁహుఁ."

"అయితే యిక్కడికెందుకు వచ్చావు, మరి?"

"సూరి ఇక్కడ ఉండమన్నాడు. ఇప్పుడే వస్తానన్నాడు. ఇంకా రాలేదే, పోదామా?"

"పద."

దారితీసింది జానకి. తనని గుళ్లోకి వెళ్ళమని బలవంతం చేస్తుందనుకున్నాడు విశ్వం. కాని ఆమె అలా ప్రవర్తించకపోవటం అతనికి కొంచెం ఆశ్చర్యంగానే ఉంది. దేవుణ్ణిగురించి జానకితో వాదన వేసుకోవాలనిపించిందతనికి. కాని ఆమె అందుకు ఆస్కారమేం ఇవ్వటంలేదు. ఇద్దరూ నడుస్తున్నారు. దారిలో సూరి కలిశాడు.

"పరిస్థితి అదుపులోకి వచ్చినట్టేనా?" ఆందోళనగా అడిగాడు విశ్వం.

"కొంచెం ఉద్రిక్తంగానే ఉంది వాతావరణం. కాని సర్దుకుంటుందనుకోవొచ్చులే. లోలోపల రాజుతూనే ఉంటుందనుకో."

"దెబ్బతగిలిన వాడెలా ఉన్నాడు?"

"ఆస్పత్రిలో చేర్పించి వచ్చాం. అంత ప్రమాదమేం లేదు."

"ఈ ఊళ్ళో ఆస్పత్రి ఉందా?"

"ఉందిలే లోకల్ ఫండ్ డిస్పెన్సరీ."

"డాక్టరేమన్నాడు?"

"ప్రాణభయం ఏమీ లేదన్నాడు కాంపౌండర్."

"డాక్టర్!"

"డాక్టర్ ఈ ఊరినించి బదిలీఅయి మూడు నెలలయిందిలే. ఇంకా కొత్తడాక్టరు రాలేదు."

"నిజం? విడ్డూరంగా ఉందే!"

సూరిపొడిగా నవ్వాడు.

"అదంతేలే. డాక్టర్లు కొరతగా ఉన్నారట."

కొంచెంసేపు మౌనంగా నడిచారు వాళ్ళు. మలుపు తిరగగానే కొంతమంది పిల్లలు ఏకోతి కొమ్మంచో ఆడుకుంటూ కనిపించారు. వాళ్ళని దగ్గిరికి పిలిచి జానకి కొబ్బరి చిప్పలు ఇచ్చింది.

"చెయ్యినొప్పిపుడుతోంది కాబోలు. పాపం" అన్నాడు విశ్వం.

"ప్రసాదం" అంది జానకి.

"ధర్మానికి మారుపేరా?" అన్నాడు. "ఏదోలే, వాళ్ళకీ నాకు తృప్తి" అందామె.

ఇంచుమించు అదే సమయంలో ఓ కుంటివాడు ఎదురై "ధర్మంబాబూ" అన్నాడు. విశ్వం ముఖం చిట్లించుకుని కసురుకున్నాడు. అడుక్కునే వాళ్ళని చూస్తే అతని కదోవిధమైన అసహ్యం. జాలిలేదని కాదు. కాని అవకలి మనిషిని ఆ స్థితిలో చూస్తే అతనికి ఈసడింపు అప్రయత్నంగా కలుగుతుంది. కుంటివాడు సూరివైపు చూసి చెయ్యి జాపాడు.

"వెధవ్వేషం!" అన్నాడు విశ్వం.

పళ్లెంలోంచి చిల్లరడబ్బులు తీసి జానకి వాడి చేతిలో వేసింది. అతను ఏదో దీవన గొణిగి వెళ్ళిపోయాడు.

"అలవాటు చేస్తేనే వాళ్లు ఈ విధంగా తయారయేది."

"పోనీలే, పాపం" అంది జానకి.

విశ్వం ఊరుకోకుండా ముష్టివాళ్ళనిగురించి ఓ లెక్చరు దంచేశాడు. దేశం ఇలాంటి సోమరిపోతుల్ని భరించలేదన్నాడు. సంఘానికి ఇదో చీడపురుగులా తయారైందనీ, ముష్టి వెయ్యటం వాళ్ళనిమరింత నికృష్ట జీవితానికి అంకితం చెయ్యటమేననీ ఏమేమిటో మాట్లాడాడు.

జానకీ, సూరీ ఏమీ మాట్లాడలేదు. విశ్వానికి కొంచెం అనుమానం వేసింది. వాళ్ళు తనమాటలు వింటున్నట్టు లేదు. అంటే తనది వెర్రి వెంగళప్ప ధోరణి అని కాబోలు వాళ్ళ అభిప్రాయం! అభిమానం ముంచుకొచ్చి ఉపన్యాసం ముగించేస్తూ అన్నాడు.

"మీకు తెలియదు పట్టణాల్లో బిచ్చగాళ్లది ఎంత పెద్ద సమస్యో!"

"పోనిద్దూ" అన్నాడు సూరి. కాని జానకిమాత్రం నోరు మెదల్పలేదు. అలా ఊరుకోటం విశ్వానికి నచ్చలేదు. తనది తప్పో రైటో తెల్చాలని కాదు. తను అంతసేపు హేతుపూర్వకంగా మాట్లాడినా ఆమె అలా నిర్లిప్తంగా వుండటం తనకి కష్టంగా వుంది. చిన్నతనం కూడా వేసింది. చూస్తే జానకిది కొంచెం విరక్తత్వ స్వభావంలా వుంది.

ఇంటికి చేరేసరికి అసుర సంజ వేళయింది. వీధి వాకిలి ఓరగా వుంది. లోపలికి వెళ్లేసరికి ఆరుబయట

4

పేము పడకకుర్చీలో కూర్చుని పాలేరు వెంకన్నతో ముచ్చటిస్తున్న వెంకట్రామయ్యగారు కనిపించారు. వాళ్ళ ముగుర్నీ చూడగానే అడిగారు ఆయన.

"రాములవారి గుడికి వెళ్ళొచ్చారా?"

"ఊఁ." అన్నాడు సూరి.

"ఏమిట్రా సూరీ, మన వెంకన్న ఏదో గలాటా జరిగిందంటున్నాడు?"

సూరి జరిగింది పూసగుచ్చినట్లు చెప్పసాగాడు. మళ్ళీ ఆ గొడవంతా ఏకరువు పెట్టటం విశ్వానికి విసుగు పుట్టిస్తోంది. లేచి లోపలికి వెళ్ళాడు. అక్కడ జానకి కొబ్బరి ముక్కలు చాకుతో తరుగుతోంది. విశ్వాన్ని చూడగానే పళ్ళెం అతనిముందుకు తోసి "ఇదుగో బావా, దేవుడిప్రసాదం—వొద్దనకూడదు" అంది. ఆ ముందుజాగ్రత్తకి అతనునవ్వి కొబ్బరిముక్కలు నోట్లో వేసుకున్నాడు.

"అరిటిపండు మాత్రం ఇవ్వకు జానకీ, నాకు చక్కెరకేళీ తప్ప సాదావి ఇష్టంలేదు" అన్నాడు.

రాత్రి భోజనాలయాయి. దొడ్లో అందరికీ పక్కలు వేశారు. పందిరిమల్లె పకోలున నవ్వినట్టుగా పూలతో నిండి సువాసనలు వెదజల్లుతోంది. దొడ్డి గుమ్మం ఎదురుగానే గ్రామచావడి ఉంది. అక్కడ సందడి ఎక్కువగా వుంది. హరికథా కాలక్షేపం. దొడ్డి తలుపులు తెరుచుకుని చాప వేసుకుని సీతమ్మగారూ, జానకీ కూర్చున్నారు. వెంకట్రామయ్యగారు చుట్టపొగ గుప్పునవొదుల్తూ, బయట అటూ ఇటూ పచార్లుచేస్తూ కథాశ్రవణం చేస్తున్నారు. సూరీ, విశ్వం మంచాలమీద పడుకుని వీలైనప్పుడు హరికథ వింటూ, కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు. విశ్వానికి కొద్దిసేపట్లో మాగన్ను పట్టింది.

"ఘనుడా భూసురుడేగెనో

నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో..."

ఆ పైన విశ్వం వినలేదు. అతనికి మళ్ళీ మెలకువ వచ్చేసరికి రుక్మిణీకల్యాణం ఐపోయింది. హరిదాసు ఉత్సాహంగా "జై శ్రీమద్రమారమణ గోవిందో హరి" అంటున్నాడు.

3

కోవపల్లిగ్రామంలో వెంకట్రామయ్యగారు ఒకప్పుడు చిన్న రైతుమాత్రమే. ఉడుకురక్తం పొంగే వయసులో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశానికి అంతో ఇంతో నిస్వార్థమైన సేవచేశాడు. తరవాత తరవాత కుటుంబభారం నెత్తినపడి సంసార సాగరంలో మునిగి గ్రామంలోనే స్థిరపడిపోయి రాజకీయ జీవితానికి ఉద్వాసన చెప్పాడు. పొలాల్లో స్వయంగా కష్టించి పనిచేసి క్రమేణా పసుపు, పుగాకు పంటల వల్ల వచ్చే ఆదాయంతో మోతుబరి ఆసామీ అయాడు. ఆయనకి సూరి, జానకి ఇద్దరే సంతానం. కిందటి సంవత్సరమే సూరి బి. ఏ. పూర్తిచేశాడు. పై చదువులకి పోవాలని ఎంతో ఉబలాటపడ్డాడు. కాని వెంకట్రామయ్యగారికి అది ఇష్టంలేకపోయింది. పెద్ద చదువు చదివితే సూరి పల్లెలో పొలం వ్యవహారాలు చూసుకుంటూ కాలం గడపటానికి ఇష్టపడడని ఆయన భయం. చూసే దిక్కులేకపోతే సుక్షేత్రమైన మాగాణీ బంజరుభూమైపోతుంది. తనకేమో ఓపిక సన్నగిల్లుతోంది. అందువల్ల సూరి చదువుకి స్వస్తిచెప్పి ఇంట్లోనే ఉండటం తన అభిమతమని ఘంటాపథంగా చెప్పాడు. అయినా కూడా పైచదువులకి వెళ్ళాలని పట్టుదల ఉంటే వెళ్ళమన్నాడు. కాని అలా ఇరుకున పెట్టటం సూరికి సరిపడలేదు. తను చదవనే చదవను పొమ్మన్నాడు. కొత్తలో కోపంతో పొలంపని చూడటం కూడా మానేశాడు. కాని ఎల్లకాలం ఒకేరీతిగా ఎవరూ ఉండరు. రాను రాను పరిస్థితుల్ని సరిపెట్టుకుని పోయిన ఉత్సాహాన్ని కొద్ది కొద్దిగా కూడదీసుకుని తండ్రికి అన్నింటిలో చేదోడు వాదోడుగా ఉండసాగాడు. చదువు వచ్చినవాడు కావటంవల్ల గ్రామంలో అందరిలో పరపతికూడా ఉంది. పల్లెటూరి రాజకీయాల్లో అతను కలగచేసుకోడు. పల్లెజనం సాంస్కృతికంగా అభివృద్ధిపొందే కార్యక్రమాల్లోమాత్రం విధిగా పాల్గొంటాడు. ఈ స్థితిలో విశ్వం వచ్చి చదువు కొనసాగించమని పురికొల్పాడు. అతనిలో అణగిఉన్న కోరిక మళ్ళీ పైకుబికింది. మామయ్యతో ఈ విషయం ప్రస్తావిస్తానని విశ్వం మాట ఇచ్చాడు.

పండగవెళ్ళిన రెండోరోజున విశ్వం ప్రయాణం కట్టాడు. ఎంతో బలవంతంమీద అందర్నీ ఒప్పించాడు.

జానకి కాఫీతెచ్చి ఇచ్చింది. ఈ రెండురోజుల్లో పునరుద్ధరించబడిన చనువుతో "థాంక్స్" అన్నాడు.

"వొద్దులే."

"ఏం?"

"ప్రతి చిన్న విషయానికీ ఇక్కడ కృతజ్ఞత స్వీకరించే అలవాటు లేదుగా."

"ఓహో! సరే అయితే, ఉపసంహరించుకున్నాను. మరి నేను వెళుతున్నాను."

"మళ్ళా ఎప్పుడు రావటం?"

విశ్వం రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు. "బాబోయ్, మళ్ళీనా?"

జానకి నవ్వాపుకొని "అదేమిటి, అలా అంటావు?" అంది.

"నాకు ఒంటరితనం ఇష్టం. బస్తీలో రెండో కంటివాడికి తెలియకుండా మన బతుకు మనం బతకొచ్చు. ఇక్కడ ప్రతివాడికీ మన గొడవే కావాలి. పైగా ఈ పోట్లాటలూ, కొట్లాటలూ నేను చూస్తూ కూర్చోలేను. అబ్బబ్బ! ఎంత అజ్ఞానం. ఏదైనా నేర్చుకుందామని ఒక్కడికీ లేదుగద. పైగా ఈర్ష్య ప్రతిదానికీ."

"అది అందరికీ సహజమేగా."

"ఇక్కడివాళ్ళసంగతి వేరులే."

"స్థలాన్నిబట్టి స్వభావాలు మారతాయా మనుషులకి?"

"పరిస్థితుల్నిబట్టి ప్రవర్తన మారొచ్చని నా నమ్మకం. మీ ఊరినిగురించి మంచిమాటలు చెప్పటం లేదని నీకు కష్టంగా ఉన్నట్టుంది. పోనీ, ఓ మీటింగు ఏర్పాటుచేయిస్తే కాసేపు పొగిడి వెళతాను."

"నువ్వు మీటింగు పెడితే వాళ్ళు వస్తారా?"

"రారు. అదే నేను అనబోయేది. వాళ్ళకి తెలియదు. చెబితే వినరు."

"మాటలు చెబితే ఎవరైనా బాగుపడతారా?"

"ఒకరు చెప్పేదేమిటి? మనిషికి కాస్త ఆలోచన కావాలి. అందుకోసం ఏకాంతం కావాలి. వెధవ కబుర్లు కొట్టిపోస్తూ, చీల్లాడుతూ కాలం గడపకపోతే, ఏటిఒడ్డునో ఏ చోటో కూర్చొని ప్రకృతిలో లీనమై మంచీ చెడూ ఆలోచించుకుంటూ జీవితంలో చీకూ చింతా లేకుండా కలిసి కట్టుగా బతకటం నేర్చుకోకూడదూ?"

జానకి చిరునవ్వు నవ్వింది. ఆమె ఏమీ అనకపోవటంతో తను బాగామాట్లాడాడని విశ్వం సంతోషపడ్డాడు.

బాగా తెల్లవారింది. వెంకన్న బండి కట్టుకొచ్చాడు. బస్సుదాగిదాకా విడిచిపెట్టి రావటానికి వెంకట్రామయ్యగారూ, నూరి సిద్ధపడ్డారు.

"వెళుతున్నా జానకీ"

"మంచిది. అందర్నీ అడిగానని చెప్పు బావా?" అంది జానకి.

విశ్వం నవ్వుకున్నాడు. ఈ లాంఛనాలన్నీ అర్థం చేసుకుని అమల్లో పెట్టేటంత వయసొచ్చిందా జానకికి! తనప్పుడే పెద్దవాళ్ళలో చేరిపోయినట్టుగా ప్రవర్తిస్తోంది ప్రతి విషయంలో.

రెండెడ్లబండీ జోరుగా పోతోంది. ఇంకా బాగా ఎండెక్కనందువల్ల హాయిగా చల్లగా గాలి వేస్తోంది. ఎద్దుల మువ్వలధ్వనులు వాద్యసంగీతంలా లయబద్ధంగా వినిపిస్తున్నాయి. కొంచెందూరంలో ఎదురుగా ఓ బండి వస్తోంది.

"ఎవరిదిరా ఆబండి? "వెంకట్రామయ్యగారు అడిగారు.

"మునసబుగారి దండి" అన్నాడు వెంకన్న ఎద్దుల్ని అదిలిస్తూ.

"నూరి చదువు సంగతేమిటి మావయ్యా" విశ్వం కదలేశాడు విషయాన్ని.

"గ్రాడ్యుయేటయాడుగా."

"పై చదువు సంగతి."

"ఎందుకురా బోలెడంత డబ్బు పోసి చచ్చు చదువులూ?"

"అయితే నాది చచ్చుచదువేనంటావు"

వెంకట్రామయ్యగారు నాలిక కొరుక్కున్నాడు.

"అది కాదురా. వాడు తప్ప నాకు ఆసరా ఎవరున్నారు చెప్పు. వాడు చదువుకని వెళ్ళిపోతే, వ్యవహారాలన్నీ ఏమయ్యేట్టు?"

"అందుకని వాడి భవిష్యత్తు పాడుచేస్తావా ఏమిటి?"

"వాడి భవిష్యత్తుకేం. సంపాదించి ఎవరికీ ఎత్తిపొయ్యక్కర్లేదుగా."

"సంపాదనకోసమేనా చదువులు?"

"ఈ రోజుల్లో అంతే."

"ఎవరో అనాలిసినమాటలు నువ్వంటావేం మావయ్యా?"

"నీకు తెలియదు లేరా విశ్వం. నువ్వూరుకో."

"పొలాలు కౌలు కిచ్చేసి అందరూ ఒక చోటే ఉండొచ్చు. విశేషంగా రెండేళ్లు కాగానే ఎం. ఏ. ప్యాసైవస్తాడు."

"అక్కడితో అయినట్టేమిటి? మరొకటి చదవాలనిపించవచ్చు. చదువుకి అంతేమిటి? మన పరిస్థితులు చూసుకోవాలి గాని."

"నీకోపం వొస్తే రావొచ్చుగాని ఈ విషయంలో నువ్వు నీ స్వార్థమే చూసుకుంటున్నావు మావయ్యా."

వెంకట్రామయ్యగారు పొడిగా నవ్వారు.

"పోనీ అలానే అనుకోండి. వాడికి అంతపట్టుదలగా ఉంటే చదవొద్దని నేనేం అనలేదే."

"అదా రాజకీయపు ఎత్తు, నువ్వు మనస్ఫూర్తిగా వెళ్ళమనక పోతే వాడు వెళ్ళడు."

"నేను వాడి బాగుకోరే వాడినికాదా?

విశ్వానికి విసుగుపుట్టింది. ఊరుకోమన్నట్టు సంజ్ఞ చేశాడు సూరి.

"నీ ఇష్టం." అన్నాడు విశ్వం.

కొంచెం సేపు ఎవరూ మాట్లాడలేదు. మునసబుగారి బండి వేగంగా వస్తోంది. ఇద్దరు పాలేళ్ళకీ కొంచెం పోటీ పడ్డది. ఎవరి ఎద్దులూ తీసిపోయినవి కావని రుజువు కావాలి. గంటల మోతలు ఎక్కువయాయి. ఎదురెదురుగా వెళ్ళే బళ్ల మధ్యదూరం తక్కువౌతున్న కొద్దీ జోరు ఎక్కువ కాసాగింది.

బండిని బండి దాటుతోంది. ఇరుసూ ఇరుసూ ఒరుసుకుని చక్రం చక్రం ఢీకొన్నాయి. ఆగిపోయాయి బళ్లు రెండూ, ఇరుసులు తప్పించాలి. వెంకన్న దిగబోయి మళ్ళీ ఎందుకో మనసు మార్చుకుని కూర్చున్నాడు. అవతల వ్యక్తీ అలాగే చేశాడు. వాళ్లిద్దరూ మాటామాటా అనుకున్నారు. నీది తప్పంటే నీది తప్పన్నారు. ఎవరిది తప్పో తేలలేదు. ఇంటువంటివి తేలేవి కూడా కాదు మునసబుగారు కదల్లేదు. తీవిగా కూర్చున్నారు. వెంకట్రామయ్యగారూ అంతే.

"ఏమిట్రా ఈ గొడవ?" అన్నాడు విశ్వం.

సూరి పొడిగా నవ్వాడు "ముందెవరు దిగితే వాళ్ల అంతస్తు తక్కువ, చిక్కే!" అన్నాడు.

పాలేళ్లా మాటలు మీరుతున్నారు.

"ఇద్దరూ పొలాల్లో పనిచేసుకునే వాళ్లే. ఇద్దరూ శ్రమజీవులే. పొద్దున లేస్తే మొహా మొహాలు చూసుకునేవాళ్లే. ఈ కీచులాట ఎందుకు?"

"అదే తమాషా వాళ్లకోసం కాదు వాళ్ల పేచీ. వాళ్ల యజమానులకోసం, యజమానుల ఘనతబట్టి తమ ఘనత కొల్చుకోటం ఇంకా పోలేదులే." చిన్నగా చెప్పాడు సూరి.

వెంకట్రామయ్యగారు కొంచెం ముందుకి వెళ్లారు.

మునసబుగారుకూడా జరిగారు. పాలేళ్ల మాటల్లో యజమానులమాటలు కలిశాయి. పోరు ఘోరమయ్యే సూచన కనిపించింది.

బండిలోంచి గభాలున ఉరికాడు సూరి. వెనకనే విశ్వంకూడా దూకాడు.

అవతల బండిలోంచి అదే సమయంలో ఒక యువకుడు కిందికి దూకాడు. ఇంచుమించుగా ఒకే సమయంలో అందరూ ఇరుసులమీద చెయ్యేశారు. బళ్లు విడిపడ్డాయి. ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. మళ్లీ బళ్లలో ఎక్కారు. క్రమ క్రమంగా బళ్ల మధ్య దూరం ఎక్కువ కాసాగింది.

వెంకట్రామయ్యగారు ఓ సారి ఆకాశంలోకి చూస్తూ కొంచెం అర్థ స్వగతంగా అన్నాడు.

"నా చిన్నతనపు రోజుల్లో ఇలాగే జరిగివుంటే తలకాయలు ఎగిరేవి."

ఆలోచనలో నిమగ్నుడైవున్న విశ్వం ఆ మాటలు విని సూరివైపు కొంచెం ప్రశంసా పాత్రంగా చూశాడు. అతను నిర్లిప్తంగా శూన్యంలోకి చూడసాగాడు.

"ఆ అబ్బాయి ఎవరు?"

"మునసబుగారబ్బాయి, పట్నంలో చదువుకుంటున్నాడు." క్లుప్తంగా చెప్పాడు సూరి.

ఆ తరవాత చాలా సేపటిదాకా ఎవరూ ఏమీ మాట్లాడలేదు. చిరుగంటల గణగణ వింటూ కూర్చుండిపోయారు.

[సశేషం]